మొక్కలు నాటిన ఆదర్శ్ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చిన్నముసిడివాడలో పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ స్పెషల్ క్యాంపు 7వ రోజు విజయవంతంగా జరిగిందని ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.సంధ్య రాణి తెలియజేసారు. ఈ స్పెషల్ క్యాంపు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఒక్కొక్క విద్యార్థి, ఒక్కొక్క మొక్కను తెచ్చి నాటినట్లు తెలిపారు. ఈ వాలిడెక్టరీ ఫంక్షన్ లో ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ సెక్రటరీ, కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఎన్.ఈ.ఫ్లోరా, ద్రోణంరాజు పార్క్ ప్రెసిడెంట్ కనక రాజు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అర్నాల్డ్ స్ట్రాంగ్ జిమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - భీమిలి: అర్నాల్డ్ స్ట్రాంగ్ జిమ్ 3వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్ కోచ్ నాగరాజు (జిమ్ రాజు) మాటాడుతూ 3వ వార్షికోత్సవ సందర్భంగా 43 మంది సహృదయంతో రక్తదానం చేసారన్నారు. జిమ్‌కి వ్యాయామ సాధన చేయడానికి వస్తున్నవారంతా సహాయ సహకారాలు అందించడం వలన ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరిగిందన్నారు. విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) హనుమంతవాక వారు రక్తం సేకరించి సహకరించినందుకు విమ్స్ డైరెక్టర్ డా.రాంబాబుకి డా.హర్షిత బృందానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా రక్త దాతలకు భీమిలి టెన్నిస్ క్లబ్ సభ్యులు షణ్ముఖరావు, లాయర్ వెంకటేష్, ట్రస్ట్ కనస్ట్రక్షన్స్ అధినేత అడపా యుగేష్, పూసర్ల శ్రీనివాస్ ప్రత్యేక బహుమతిని అందించారు, ఈ రక్తదాన శిబిరంలో చంద్రకళ అనే మహిళ రక్తదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎస్.టి.ఎల్.లో స్వచ్ఛ పక్వాడా

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్‌లో స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. నిర్లక్ష్యం చేయబడిన ప్రదేశాలను శుభ్రపరచడం, పైకప్పులను నిర్మించడం, ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త లేకుండా చేయడంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఉద్యోగుల భాగస్వామ్యాన్ని గుర్తించడానికి ఫ్యామిలీ గేట్ వద్ద సంతకం ప్రచారం, సెల్ఫీ బూత్ ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ స్వచ్ఛత అనేది భౌతిక, ఆధ్యాత్మిక పరంగా మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అన్నారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, రాహుల్ దీక్షిత్, ఇతర అధికారులు, సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, వర్క్స్ కమిటీ సభ్యులు ఎం.ఈ.ఎస్. ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్యాన్న ప్రసాద పథకానికి లక్ష రూపాయలు విరాళంగా భక్తులు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన వారాహి, చలన చిత్ర సంస్థ రూ. 1,11,000/- విరాళంను సీనియర్ గుమాస్తా సూర్యనారాయణలకు అందజేశారు. ఆలయ మర్యాదలు ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణా విరాళం ఇచ్చిన సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవని అధికారులు తెలిపారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

జ్యూట్ మిల్ కళ్యాణ మండపంలో పెన్షనర్స్ డే

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస జూట్ మిల్లు కళ్యాణ మండపంలో జూట్ మిల్లు పెన్షన్ల సంఘం, ఆల్ రిటైర్మెంట్ పెన్షనర్ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. చిట్టివలస జూట్ మిల్ పెన్షన్ల సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు సుధాకర్, బాబురావు హాజరయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్, బాబాజీ, ఉపాధ్యక్షులు చిల్ల అప్పారావు, సహాయ కార్యదర్శి మోరా అప్పలరాజు, కోశాధికారి పంపాను సూర్యనారాయణ, సీనియర్ నాయకులు సింగిడి అప్పా రావు, ఏఐటీయూసీ నాయకులు కొండవు ఈశ్వరరావు, సిఐటియు నాయకులు నర్సింగరావు, చిట్టివలస జూట్ మిల్ బాధితులు సంఘం నాగోతి అప్పలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పెన్షన్లు ఐక్యతే మనకి శ్రీరామరక్ష అన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలో నోమాన్ సత్తా

విశాలాంధ్ర - ఆనందపురం: అండర్ 13 జాతీయ ఆల్ ఇండియా యోనెక్స్ సన్‌రైజ్ బ్యాడ్మింటన్ సింగిల్స్ టోర్నమెంట్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన క్రీడల్లో వప్పు నోమాన్ సత్తా చాటాడు. కే.కోటపాడుకు చెందిన వప్పు నోమాన్ బీహార్ నిర్వహించిన అండర్ 13 బ్యాట్మింటన్ సింగిల్స్ ఫైనల్స్‌లో విజయకేతనం ఎగరవేశాడు. కృషి పట్టుదలతో క్రీడల్లో రాణించి, నేషనల్ స్థాయి నుంచి ఓటమి లేకుండా తిరుగులేని క్రీడాకారుడిగా గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు సత్యనారాయణ చండీప్రియ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు నోమాన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వీపీఏను సందర్శించిన అమెరికా కాన్సులేట్ జనరల్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: యునైటెడ్ స్టేట్స్ కాన్సులేట్, హైదరాబాద్, కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ గురువారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

పోర్ట్‌లో ఉన్న ఆధునిక మౌలిక వసతులు, సముద్ర వాణిజ్యంలో విశాఖపట్నం పోర్ట్ పోషిస్తున్న కీలక పాత్ర వంటి అంశాలను పోర్ట్ అధికారులు కాన్సుల్ జనరల్‌కు తెలియజేశారు. సరుకు నిర్వహణా సామర్థ్యం, పోర్ట్‌లో కొనసాగుతున్న ఆధునికీకరణ, యాంత్రీకరణ పనులు, పోర్ట్ కార్యనిర్వహణా సామర్థ్యాలను మెరుగుపరచడం, పర్యావరణకు పరిరక్షణకు ఉపయోగపడే కవర్డ్ స్టోరేజ్ సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు , విభాగాధిపతులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలి

సీపీఐ జాతీయ సమితి సభ్యులు జేవీఎస్ఎన్

విశాలాంధ్ర - విశాఖ: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించే ప్రయత్నాలను విరమించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు జె.వి. సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. విశాఖ జగదాంబ జంక్షన్లో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. నూతన వైద్య కళాశాలల్లో పీపీపీ విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రమాదకరమైనదని విమర్శించారు. ఈ విధానం.. సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, పేద, మధ్య తరగతి వర్గాల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఇది రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధమైన, సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్య అని విమర్శించారు. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నంబర్ 590 జారీ చేయడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఇది కేవలం వైద్య విద్యను వెనుకబడిన సామాజిక వర్గాలకు దూరం చేయడమే కాకుండా అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేద ప్రజలకు వైద్య సేవలకు కూడా దూరం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలోని స్థిరమైన ఉద్యోగావకాశాలు నిరుద్యోగ యువతకి అందకుండా పోతాయని అన్నారు. ప్రజల ఆరోగ్య హక్కులు, ప్రభుత్వ వైద్య విద్యా వ్యవస్థలు విచ్ఛిన్నమవుతాయని అన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 9 రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 100 విడుదల చేయడం ద్వారా మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాల్లో ప్రతిపాదించిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుతో రాష్ట్రంలో వైద్య విద్య సీట్ల సంఖ్య పెరుగుతుందని, వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశించడం జరిగిందని అన్నారు. అయితే గత ప్రభుత్వం జీవో నెంబరు 107, 108 తీసుకొచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా ఆయా మెడికల్ కాలేజీల్లో సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించిందని విమర్శించారు. జీవో నెంబరు 107, 108 రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా ఉద్యమించాయన్నారు. యాజమాన్య కోటా సీటుకు రూ.12 లక్షలు, ఎన్.ఆర్.ఐ. కోటా సీటుకు రూ.20 లక్షలు వసూలు చేస్తున్నారంటూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా విమర్శించాయని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తరువాత ఆ జీవోలను రద్దు చేయకపోగా వైద్య విద్యను పీపీపీ విధానంలో పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం అన్యాయమని

విమర్శించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు 107, 108లను రద్దుచేసి, నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలని, వాటిని శాశ్వత ప్రభుత్వ, ప్రజా ఆస్తులుగా నిలిపి, పేద ప్రజల వైద్య విద్య హక్కును, సామాజిక న్యాయాన్ని, భవిష్యత్తు తరాల అవకాశాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రహిమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, కె.సత్యాంజనేయ, ఎం. మన్మధరావు, ఆర్. శ్రీనివాసరావు, సి ఎస్ క్షేత్రపాల్, ఎం డి బేగం, కె.వనజాక్షి, ఎన్ నాగభూషణం, సమితి సభ్యులు యు.నాగరాజు, కె.అచ్యుతరావు, వై రాంబాబు, వి.సత్యనారాయణ, పి.సూర్య పద్మ, జి.రాంబాబు, జి.జయ, ఎన్. అప్పన్న, ఎ.ఆదినారాయణ, పైల ఈశ్వరరావు, ఎ.దేముడమ్మ, బి.పుష్పలత, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. నిరసన అనంతరం కలెక్టరు కార్యాలయంలో డి.ఆర్.ఓ.కి వినతిపత్రం అందజేశారు.

ఇస్కాఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఇస్కాఫ్ 2026 క్యాలెండర్ ను గురువారం సాయంత్రం జీవీఎంసీ అదనపు కమిషనర్ డివి రమణమూర్తి చేతుల మీదుగా సిపిఐ ఫ్లోర్ లీడర్ ఏ జే స్టాలిన్ సారధ్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీసీ రమణమూర్తి క్యాలెండర్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే రహమాన్, వై.సత్యవతి, సూర్య కుమారి, హెన్నా, ప్రియాంక, కే.సత్యాం జనేయ, క్షేత్ర పాల్ రెడ్డి, ఎస్.నరసింహులు, రాంప్రభూ, ఎంఏ బేగం, నేలివాడ అప్పారావు, వాసుపల్లి నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు ఆపాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు

విశాలాంధ్ర - విశాఖ : విశాఖ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు 2026 - 2027 విద్యా సంవత్సరానికి ముందే అడ్మిషన్స్ చేస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) విశాఖ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ఆర్.ఐ.ఓ. పి.మురళీధర్‌కి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి గుర్తింపు లేకుండా కొన్ని కొత్త కళాశాలలు ఇతర కళాశాలలతో కుమ్మక్కై పి.ఆర్.ఓ.ల ద్వారా తల్లిదండ్రులను మభ్యపెట్టి అధిక ఫీజులకు అడ్మిషన్స్ చేస్తున్నారని అన్నారు. ఇది పూర్తిగా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో గుర్తింపు లేకుండా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ అడ్మిషన్స్ ప్రారంభిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెయిన్స్, నీట్ ఎగ్జామ్స్ పేరుతో రాత్రి 8:30 వరకు కాలేజీలోనే ఉంచుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి శారీరక వ్యాయామం లేకుండా చేస్తున్నారని, వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. పర్మిషన్స్ లేకుండా కమర్షియల్ భవనాలలో తరగతులు నిర్వహిస్తూ హాస్టల్స్ కూడా నడుపుతున్నారన్నారు. ఇటువంటి కాలేజీలపై చర్యలు తీసుకోవాలి కోరారు. లేనిపక్షంలో ఆయా కళాశాలల వద్ద ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ ఐ ఓ మురళీధర్ స్పందిస్తూ అన్ని జూనియర్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. విద్యాశాఖ నిబంధనలు పాటించని కళాశాలపై కచ్చితంగా నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేఖర్, సహాయ కార్యదర్శి హేమానంద్, ఉపాధ్యక్షులు కిరణ్, అభిషేక్, నాయకులు గణేష్ పాల్గొన్నారు.

బీహార్ సీఎం నితీష్ కుమార్ వైఖరి సిగ్గుచేటు

ఇన్సాస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎంఏ బేగం

విశాలాంధ్ర - విశాఖ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇటీవల ఒక ముస్లిం మహిళకు నియామక ఉత్తర్వులు ఇస్తూ ఆమె ధరించిన హిజాబ్ ని బలవంతంగా తీసివేయడం సిగ్గుచేటని సిపిఐ మైనారిటీ విభాగం ఇన్సాస్ రాష్ట్ర

కమిటీ సభ్యురాలు ఎంఏ బేగం గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. హిజాబ్ అన్నది ముస్లింల మతవిశ్వాసమని అన్నారు. మత విశ్వాసాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి ఈ విధంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ముఖ్యమంత్రి వ్యవహార శైలిలో నియంతృత్వం మహిళల పట్ల ఆయన వైఖరి వెలడవుతోందని తెలిపారు ఇటువంటి వారిని రాజకీయాల నుంచి బహిష్కరించాలన్నారు. ముస్లిం మహిళలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటికో చెట్టు ప్రగతికి మెట్టు

విశాలాంధ్ర - పద్మనాభం: ప్రతి ఇంటికో చెట్టు ప్రగతికి మెట్టు, చెట్లు పెంచండి ఆరోగ్యానికి పొందండి అనే నినాదంతో ఎస్ఓఎస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రేవిడి, ఆర్.వెంకటాపురం గ్రామంలలో అవగాహన ర్యాలీ జరిగింది. స్థానికంగా జడ్పీ స్కూల్ విద్యార్థులు ఎస్ఓఎస్ సంస్థ సహకారంతో ఈ ర్యాలీ నిర్వహించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యవంతమైన గాలిని స్వాసించడం ద్వారా ఆరోగ్యం పెరుగుతుందనని ర్యాలీ ద్వారా అవగాహన చాటారు. రేవడి జంక్షన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్ వెంకటాపురం వరకు సాగింది. ఈ ర్యాలీలో యానిమేటర్లు మణి, జానకి తో పాటు ట్యూటర్ సత్యనారాయణ మాస్టారు, స్కూలు విద్యార్థిని విద్యార్థులు, వీధి నాటక కళాకారులు దేవిడ్రాజు, కుమారి , సలాది భవాని రాజు, సముద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌లో జెడ్సీ అతి..!

- మీడియా, ప్రజాప్రతినిధులపై రుబాబు
- బయటకు వెళ్లాలంటూ హుకుం
- మొక్కుబడిగా సాగిన ఫిర్యాదుల స్వీకరణ



విశాలాంధ్ర - కొమ్మాది: భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు గురువారం మధురవాడ జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ వివాదాస్పదంగా మారింది. ఈ సందర్భంగా ఇన్-చార్జ్ జోనల్ కమిషనర్ ఓమ్మి అయ్యప్ప నాయుడు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈసమావేశం కాస్తా రహస్య సమావేశాన్ని తలపించింది. ఉదయం 10 గంటలకే ప్రజా దర్బార్ ప్రారంభమవుతుందని ప్రకటించినప్పటికీ, ఎమ్మెల్యే మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో కార్యాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంపై ముందస్తు సమాచారం కేవలం అధికార పార్టీ నాయకులు, అధికారులకు మాత్రమే ఉండటంతో సామాన్య ప్రజల కంటే టీడీపీ అనుచరులే ఎక్కువగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు తన అధికారాన్ని ప్రదర్శించారు. అక్కడ ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులను, కార్పొరేటర్లను బయటకు వెళ్లాలని ఆదేశించారు. అనంతరం విలేకరులను ఉద్దేశించి.. మీరెందుకు లోపలికి వచ్చారు. బయటకు వెళ్ళండి అంటూ పెద్ద స్వరంతో గద్దించారు. జోనల్ కమిషనర్ తీరును నిరసిస్తూ మీడియా ప్రతినిధులు అక్కడి నుంచి నిష్క్రమించి సమావేశాన్ని బహిష్కరించారు. మధురవాడ జోన్-2 పరిధిలో ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల్లో అనేక అవినీతి ఆరోపణలు, సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిపై ప్రజలు ఫిర్యాదు చేసే క్రమంలో మీడియా ఉంటే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతోనే జెడ్సీ ఇలా వ్యవహరించినట్లు చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే పీఏలు సైతం ఫిర్యాదుల స్వీకరణ ముగిశాక ఎమ్మెల్యే మాట్లాడతారని, అప్పటివరకు బయట ఉండాలని కోరడం గమనార్హం. ప్రజా దర్బార్‌ను రహస్యంగా నిర్వహించడంపై సీపీఎం సహా ఇతర

రాజకీయ పక్షాలు మండిపడ్డాయి. ప్రజల సమస్యలు వినాల్సిన చోట పారదర్శకత లేకపోవడం దారుణమని నేతలు విమర్శించారు. అధికారుల అతి ఉత్సాహం వల్ల ఎమ్మెల్యే ప్రతిష్ఠ దెబ్బతింటోందని స్థానిక ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

61వ వార్డులో అన్నసమారాధన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గం 61వ వార్డు పరిధి

రామకృష్ణాపురం వంశీ మెడికల్స్ ప్రాంగణంలో శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి నిత్య భక్తులు పెద్ది రెడ్ల నానాజీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. శ్రీ కనకమాలక్ష్మి మార్గశిర వార మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనకు ముఖ్యఅతిథిగా 60వ వార్డు ఇందిరా కాలనీ గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షులు, వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి సరగడం పత్ని రావు పాల్గొని అన్న ప్రసాదాలను అందజేశారు.

మహారాజశ్రీ తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, హైదరాబాద్‌లో
ఎఫ్.ఎ. నెం. 293 ఆఫ్ 2025 ఇన్
సి.సి. నెం. 345 ఆఫ్ 2023
బిట్వీన్:
మెస్సర్స్ టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్
... పిటీషనర్ / అప్పిలెంట్ / ఆపోజిట్ పార్టీ
మరియు
మెస్సర్స్ జి.ఆర్. కన్స్ట్రక్షన్స్ & ఇతరులు
... రెస్పాండెంట్స్ / రెస్పాండెంట్స్
టు:
ఆర్-3:
మెస్సర్స్ లీలా కృష్ణ టయోటా, దాని అధీకృత ప్రతినిధి ద్వారా, డోర్ నెం. 164/1, పరదేశిపాలెం, ఎన్.హెచ్.-5, మధురవాడ, విశాఖపట్నం - 530041.
పై నెంబరు ఎఫ్.ఎ. నెం. 293 ఆఫ్ 2025 లో మీరు రెస్పాండెంట్గా జత చేయబడిన దృష్ట్యా, పిటీషనర్/ అప్పిలెంట్ అయిన మెస్సర్స్ టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ మీపై అప్పీల్ దాఖలు చేసినది. శ్రీ స్టేట్ కమీషన్ వారు మరియు అప్పిలెంట్ తరపున రిజిష్టరు పోస్టు ద్వారాను పంపిన నోటీసులు మీకు ముట్టనందున, ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వవలెనని మహారాజశ్రీ స్టేట్ కమీషన్ వారు ఆదేశించినది.సదరు కేసు 16-01-2026 ఉదయం 10:30 గంటలకు రెస్పాండెంట్స్ హాజరు కోసం వాయిదా వేయబడినది. కావున, ఆ వాయిదా తేదీన మీరు స్వయంగా గానీ లేదా మీ అడ్వకేటు/ప్లీడర్ ద్వారా గానీ హాజరై మీకు గల అభ్యంతరణలు తెలుపుకొని రక్షించుకోవలెను. లేని యెడల, పై స్టేట్ కమీషన్ వారు మీ పరోక్షమందు విచారణ కొనసాగించి తీర్మానం చేయబడును.
/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది: 16-01-2026
కింగ్ స్టబ్ & కసివా అడ్వకేట్స్ - హైదరాబాద్
పిటీషనర్/అప్పిలెంట్/ఆపోజిట్ పార్టీ తరపు న్యాయవాది, సెల్: 9847657976

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ, రుషికొండ, సాగర్ నగర్, వైఎల్పీ లే అవుట్, పాత మధురవాడ తదితర ప్రాంతాల్లో 7.74 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.4.28 కోట్లతో 9 రోడ్లు, రూ.కోటితో 4 డ్రెయిన్లు, రూ.38 లక్షలతో 2 పార్కులు, రూ.1.60 కోట్లతో 2 శ్మశాన వాటికలు ఏర్పాటు సహా రూ.46 లక్షలతో చెరువు అభివృద్ధి పనులు ఉన్నాయి. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలోని 9 జీవీఎంసీ వార్డుల్లో రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఒక్క నవంబరు నెలలోనే రూ.25 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.500 కోట్లతో మధుర వాడకు మంచినీటి ప్రాజెక్టు.. రూ. 465 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు పనులు తొందర్లోనే ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. సాగర్ నగర్ బీచ్ బ్యూటిఫికేషన్ కోసం రూ.16 కోట్ల ప్రాజెక్టు డిజైన్ చేశామని, అలాగే 2.5 కోట్లతో సాగర్ నగర్‌లోనే నైట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, చెట్టిపల్లి సన్యాసిరావు, శాఖారి శ్రీనివాస్, మంగాదేవి, చెట్టిపల్లి గోపీ, దొరబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ట్రాక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో పలు ప్రాంతాలలో సైకిల్ ట్రాక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ పరిధిలోని ముడసరలోవ, రాడిసన్ బ్లూ నుండి సాగర్ నగర్ తదితర ప్రాంతాలలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం ఎంతో అవసరమని అందుకు నగరంలో ముడసరలోవ పార్కు చుట్టూ ఐదు కిలోమీటర్లు, రాడిసన్ బ్లూ హోటల్ సమీప ప్రాంతం నుండి సాగర్ నగర్ బీచ్ సమీప ప్రాంతం వరకు సైకిల్ ట్రాక్ ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ముడసరలోవ చుట్టూ సైకిల్ ట్రాక్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. బీచ్ రోడ్ లో సబ్మేరియన్ ఎదురుగా గల టియు 142 ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం సమీపంలో 75 నుండి 100 మీటర్ల లోపు ఒక జాతీయ జెండా ఏర్పాటుకు అంచనాలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు ఏడుకొండలు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎస్సెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్- ఏపీ యు ఐ ఏ ఎం ఎల్ ,రీజినల్ హెడ్ చేతన్, జీవీఎంసీ సహాయక ఇంజనీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో విష్ణు పురాణం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డు క్రాంతి నగర్ కాలనీలో నార్త్ ఇండియన్స్ (పూర్వంచల్ కీర్తన మండల్) వారి ఆధ్వర్యంలో గురువారం విష్ణు పురాణం, కలశ యాత్ర నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతర ప్రాంతాల నుండి ఈ ప్రాంతంలో ఏర్పడిన నార్త్ ఇండియన్స్ తమ సంస్కృతి సాంప్రదాయాలకు కట్టుబడి పవిత్రంగా నిర్వహించుకునే పండగ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, బీజేపీ నాయకులు భద్రి, స్థానిక నాయకులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో వ్యక్తి అదృశ్యం

విశాలాంధ్ర - కొమ్మాది: పీ.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధి బక్కన్నపాలెంలోని రామాలయం సమీపంలో నివసిస్తున్న అల్లాడ నాగరాజు (36) అనే వ్యక్తి ఈ నెల 9వ తేదీ నుండి కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నాగరాజు మద్యానికి బానిసయ్యాడని, ఈ నెల 9న సాయంత్రం 6 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయారని పేర్కొన్నారు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు పీ.ఎం.పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ హిందూజాకి ఘన నివాళి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇటీవల మరణించిన హిందుజా గ్రూప్ మాజీ చైర్మన్ దివంగత గోపీచంద్ పి హిందూజా జ్ఞాపకార్థం ముంబైలో ప్రార్థనా సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ ప్రార్థనా సమావేశానికి

ఇండియా ఇంక్ కెప్టెన్‌లు, రాజకీయ ప్రపంచానికి చెందిన స్నేహితులు, పార్టీలకు అతీతంగా, దౌత్య దళ సభ్యులు మరియు పలువురు ప్రముఖ సినీ ప్రముఖులు పాల్గొన్నారు. పరమార్థ నికేతన్‌కు చెందిన చిదానంద సరస్వతి వంటి ఆధ్యాత్మిక నాయకులు, సన్నిహితులు, మొదలైన ప్రముఖ గాయకులు అనురాధ పౌడ్వాల్, నితిన్ ముఖేష్, మరియు మోహిత్ లాల్వానీ వంటి ప్రముఖ గాయకులు అతని బహుముఖ వ్యక్తిత్వం గురించి కొనియాడారు. ఈ సందర్భంగా వీరంతా జీ పీ హిందూజాకు ఘనంగా నివాళులు అర్పించారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 22ఏ భూములపై సమీక్ష

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ప్రధానంగా భూ సమస్య, 22ఏ పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో 22ఏ భూముల వివాదాల పరిష్కారంపైనే మొదటి అజెండాగా చేపడతామని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖపట్నంలో కొన్ని భూ వివాదాల్లో కొందరు రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోందనే అంశంపై తనకు ఫిర్యాదులు అందాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీఎం దృష్టికి తెచ్చారు. భూవివాదాల్లో పొలిటికల్ నేతల జోక్యాన్ని ఎంత మాత్రమూ సహించొద్దని జిల్లాల

కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూవివాదాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్నారనే ఫిర్యాదులు రాకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ పీజీఆర్ఎస్ గ్రీవెన్సులు త్వరితగతిన పరిష్కరించాలని, అన్ని రిజిస్ట్రేషన్ , ఆస్తి పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు.లింక్ డాక్యుమెంట్లు డేటా వేర్ హౌసింగ్‌లో పెడుతున్నామన్నారు. భూ సమస్యలను వందశాతం పరిష్కరించి ప్రజలకు సవ్యంగా డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే అన్నారు. హౌసింగ్ లో పొజిషన్ సర్టిఫికెట్లను కూడా త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. భూకబ్జా ఫిర్యాదులపై తక్షణం కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని, ఎట్టిపరిస్థితుల్లో నిందితుల్ని వదిలిపెట్టొద్దని, కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు ఎన్‌సిసి సర్టిఫికెట్ల అందజేత

విశాలాంధ్ర - మల్కాపురం: వివిధ పాఠశాలల్లో ఎన్‌సిసి శిక్షణ పొంది పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నం.1, నౌసేనాబాగ్, విశాఖపట్నం పాఠశాల విద్య విచ్చేసిన విద్యార్థులను ప్రిన్సిపాల్ స్కూల్ యాజమాన్యాలు

గురువారం యూనిట్ నం 249, బెటాలియన్ 13(ఏ)ను ఎన్సిసి ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ మైంగి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ, కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్న. 37 మంది క్యాడెట్లు క్రమశిక్షణ, నాయకత్వం, నిబద్ధతను ప్రదర్శిస్తూ ఎన్సిసి (ఏ) సర్టిఫికేట్‌ను విజయవంతంగా పొందడం అభినందనీ యమన్నారు. శిక్షకుడు ఏ.కిరణ్ ప్రకాష్ నేతృత్వం, మార్గదర్శకత్వం విద్యార్థులు ప్రతిభను కనబరుచుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర ఘట్టాభిషేకం

విశాలాంధ్ర - వన్‌టౌన్: బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కందుల నాగరాజు పాల్గొని పంచామృతాభిషేకాలు నిర్వహించారు. జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో మహా అన్నదానం కార్యక్రమం జరిగింది.

ఇక్కడ సుమారు 20,000 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ మార్గశిర మహోత్సవాల సమయంలో వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో తాగునీటిని సరఫరా చేశారు. మార్గశిర మాసం చివరి రోజు, 19-12-2025 (శుక్రవారం) ఉదయం 11:00 గంటలకు, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. 19-12-2025 (శుక్రవారం) సాయంత్రం 6:30 గంటలకు శాంతి దీపాలంకరణతో మార్గశిర మహోత్సవాలు ముగుస్తాయి.

మత్స్యకారులను విడుదల చేయాలి

విశాలాంధ్ర - వన్‌టౌన్: మత్స్యకారులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వైసీపీ నేత మెకానిజెడ్ ఫిషింగ్ బోటు అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ అన్నారు. రెండు నెలలుగా మత్స్య కారులు బందీలుగా ఉన్నారని, అక్టోబర్ 20న బోటులో వెళ్లి

ప్రమాదవశాత్తు బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్‌కి చిక్కి జైలులో వున్నారని అన్నారు. వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకొవాలని కోరారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సైతం పట్టించుకోవడం లేదని, పట్టుబడిన వారిలో ఉత్త రాంధ్రకు చెందిన వారు 9 మంది వున్నారని, పవన్ కళ్యాణ్ స్పందించి తగిన సహకారం అందించాలని కోరారు. మీడియా సమావేశంలో గుంటూ దానయ్య,అర్జిల్లా హరి,పుక్కల్లా ప్రకాష్ పాల్గొన్నారు.

ఏయూతో అనుబంధం మరింత బలోపేతం కావాలి

-ఏయూను సందర్శించిన అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో అమెరికన్ కాన్సులేట్ అనుబంధం మరింత బలోపేతం కావాలని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ ఆశాభావం వ్యక్తం చేసారు. గురువారం మద్యాహ్నం ఆమె ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూలో నెలకొల్పిన అమెరికన్ కార్నర్ చేపట్టిన కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇచ్చాయన్నారు. విద్యార్థులు, కరికలం, రీసెర్చ్ విభాగాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని చెప్పారు. ఎంటర్‌ప్యూనర్‌షిప్ కరికులంలో భాగం కావాలని సూచించారు. నూతన రంగాలలో కలసి పనిచేయాలని ఆమె ఈ సందర్భంగా ఏయూను కోరారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ముందుగా శతాబ్ది సంవత్సరంలో ఉన్న ఏయూ విజన్ డాక్యుమెంట్‌ను వివరించారు. అకడమిక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అవుట్‌రీచ్ విభాగాలలో పనిచేస్తున్నామన్నారు. ఏయూ స్వయంగా కొన్ని కార్యక్రమాలను అమెరికన్ కార్నర్‌తో కలసి నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఏయూలో ఈ సంవత్సరం నుంచి నూతనంగా క్వాంటం కంప్యూటింగ్

కోర్సును ప్రారంభించామని తెలిపారు. కెరియర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, సి4ఐ4 ల్యాబ్ ఏర్పాటు, నైపుణ్య శిక్షణకు అందిస్తున్న ప్రాధాన్యత తదితర అంశాలను తెలియజేశారు. ఫుల్ బ్రైట్ స్కాలర్స్‌ను కొంత కాలం ఏయూలో ఉండే విధంగా ఆహ్వానిస్తామన్నారు. వీరిని ఏయూతో అనుసంధానం చేయాలన్నారు. అనంతరం ఏయూ తరఫున అమెరికన్ కాన్సుల్ జనలర్ లారా విలియమ్స్‌ను సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా, రాహుల్‌కి ఢిల్లీ కోర్ట్‌లో ఊరట

బీజేపీకి చెంప దెబ్బ : ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్య స్వామి సోనియా, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీద వేసిన నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ కోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు ఎల్ఎన్ హాసిని వర్మ నేతృత్వంలో ఇసుకతోట జంక్షన్ వద్ద ఉన్న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ (ఈ డి) కార్యాలయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు సత్యమేవ జయతే, సోనియా, రాహుల్ జిందాబాద్ అంటూ హర్షతిరేకలు వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ సంస్థలో పెద్ద ఎత్తున నిధులు దారి మళ్లించారని బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి కేసు వేశారని, కేంద్ర ప్రభుత్వం, ఈడిని కలిసి సరైన ఆధారాలు సమర్పించడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, పీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాండవ గాయత్రి, మాజీ ఇంచార్జ్ డీసీసీ వజపర్తి శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ కే వి సూర్యనారాయణ, గవర వెంకటరమణ, జర్రిపోతుల ముత్యాలనాయుడు,ఉమ్మిడి భాస్కర్, వై ఎస్ జగన్,సేవాదళ్ జాతీయ కార్యదర్శి గంగాధర్, ఫర్వీన్ ఖాన్, రామకృష్ణ, అప్పారావు, అక్రమాని రమణ. డీసీసీ ఆఫీస్ ఇంచార్జ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గంటా గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే కొండ్రు మురళి

విశాలాంధ్ర - కొమ్మాది: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం మధురవాడ జోనల్ ఆఫీస్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తన సమస్య తెలియజేయడానికి రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ హాజరు కావడం అందరి దృష్టిని ఆకర్షించింది. మురళీకి పీఎం పాలెంలో బాబా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్) కాలేజీ ఉంది. దీనికి సమీపంలోని స్మశానం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రీవెన్స్‌లో గంటా దృష్టికి మురళీ తీసుకువచ్చారు. స్మశానానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి శ్మశాన వాటికను ప్రత్యామ్నాయ స్థలానికి మార్చే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులకు గంటా శ్రీనివాసరావు సూచించారు. ఎండాడ, మధురవాడ తదితర ప్రాంతాల్లో బడ్డీలు తొలగించడం వల్ల 20 ఏళ్ల నుంచి ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తూ వినతి పత్రాన్ని అందించారు. డ్రెయిన్లు, రోడ్లు కావాలని.. స్మశానాన్ని అభివృద్ధి చేయాలని.. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించాలని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చిక్కాల విజయ్ బాబు, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలత, పి.వి.నర సింహం, జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: నగరంలోని లైసెన్స్ బే కాలనీ దరి డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు (యాన్యువల్ డే సెలబ్రేషన్స్) ఘనంగా జరిగాయి.

కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించినటువంటి వివిధ నృత్య రూపకాలు, స్కిట్స్, ఇతరత్రా సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. అతిథులుగా హాజరైన వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య తో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతి కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు భాగస్వామ్యం కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గౌరవ అతిథి కె.శేషు బాబు మాట్లాడుతూ డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. అనుభవం, నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు, పాఠశాలలో ఉన్న సంపూర్ణ మౌలిక సదుపాయాలతో విద్యార్థులకు అధునాతన పద్ధతుల్లో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమం సమన్వయకర్త, పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. దుర్గ స్కూల్ కరిక్యులం, బోధన తీరు, ప్రతిభ పొందిన విద్యార్థులు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కేకేఆర్ గౌతమ్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల సీఓ బి. గౌతమి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లితండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

20న గాయత్రి కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశాలాంధ్ర -విశాఖపట్నం: గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ మరియు పీజీ కళాశాల (అటామనస్) గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్టు గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షులు డి. దక్షిణామూర్తి, సభ్యులు ఆచార్య పి రాజు గణపతి తెలిపారు. ఈ మేరకు గురువారం గాయత్రి కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాయత్రి కళాశాల ఋషికొండ క్యాంపస్ లోని సెంట్రల్ ఆడిటోరియంలో డిసెంబర్ 20వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు డిగ్రీ ప్రదానోత్సవం' ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ డిగ్రీల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్సీహెచ్ఈ) చైర్మన్ ఆచార్య మధు మూర్తి హాజరవుతున్నట్టు తెలిపారు. తమ గాయత్రి కళాశాలలో

2023వ సంవత్సరంలో పాసయిన యూజీ, పీజీ కోర్సుల మరియు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ స్నాతకోత్సవ సభలో డిగ్రీలను ప్రదానం చేయనున్నామని చెప్పారు. డిగ్రీ కోర్సుల నుండి ఎనిమిది మందికి, పీజీ కోర్సుల నుండి ఒకరికి మొత్తం తొమ్మిది బంగారు పతకములు, అధికశాతం మార్కులతో ఉత్తీర్ణులయిన మొదటి అయిదుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రములతో పాటూ అర్హులయిన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయడం ప్రధాన లక్ష్యం గా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.యస్. బోస్, జీవీపీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎ. సాయి రూప్, పీఆర్ఓ డి. పద్మజ ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆనందపురం ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏర్పాటు చేశారు. మండలంలోని 13 ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమక్షంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా గణేష్, ఉపాధ్యక్షుడిగా రామారావు, కోశాధికారిగా రాధాకృష్ణ, జనరల్ సెక్రెటరిగా చార్లెస్ కుమార్, జాయింట్ సెక్రెటరిగా శ్రీధర్, మీడియా అడ్వయిజర్‌గా లెంక సురేష్ ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ నిబంధనలపై యాజమాన్యాలకు అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే పాఠశాలల మధ్య సమన్వయం పెంచి, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యే గంటాకు వినతి

విశాలాంధ్ర - కొమ్మాది: ఐదవ వార్డులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జీవీఎంసీ జోన్ 2 కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిర్వహించిన స్పెషల్ పిజిఆర్ఎస్‌లో కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలైన మొల్లి హేమలత వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతం అయిన శారద నగర్ కాలనీలో కొండ ఎగువ భాగంలో త్రాగునీటి నిల్వ ట్యాంకు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని, కొండ దిగువ ప్రాంతంలో కూడా నీటి సంపు నిర్మాణం చేపట్టి క్రింద సంపు నుండి పైపులైన్ ద్వారా ఎగువ భాగంలో ఉన్న త్రాగునీటి నిల్వ ట్యాంకుకు నీటిని పంపింగ్ చేసి తద్వారా కొండవాలు ప్రాంతాల్లో ఉన్న గృహాలకు త్రాగునీరు అందించాలని కోరారు. స్వతంత్రనగర్, మారికవలస ఓజోన్ వ్యాలీ కాలనీలలో ప్రభుత్వం నిర్మించిన ఎన్టీఆర్ హుదూద్ ఇళ్లకు జీవీఎంసీ త్రాగునీరు అందించడానికి వెంటనే పైప్ లైన్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం బిల్లుపై భగ్గుమన్న కాంగ్రెస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రెండు దశాబ్దాల నాటి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ) స్థానంలో విక్షిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లును కేంద్రం రూపొందించడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుంచి ఎంవీపీ డబుల్ రోడ్డులో ఉన్న ఈడి కార్యాలయంకి చేరుకుని ధర్నా నిర్వహించారు. అక్కడ నుంచి బీజేపీ ఆఫీస్‌ని కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, స్టేట్ స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, నియోజక వర్గ ఇన్‌చార్జిలు కేవీ సూర్యనారాయణ, ఎస్.రామకృష్ణ, ప్రియాంక దండి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఆనంద్ కుమార్, రాజేష్, ఎస్సీ సెల్ పద్మిని చంద్ర శేఖర్, శ్రీధర్, గంగాధర్, వైఎస్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్‌పై హర్షం

విశాలాంధ్ర - భీమిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుకు ఎంపిక కావడం ప్రతీ తెలుగువాడు గర్వించదగ్గ విషయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. ఎకనామిక్ టైమ్స్ ద్వారా ఈ అవార్డు రావడం చాలా గొప్ప విషయమని ఇందుకు నా తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. వందల కంపెనీలను రాష్ట్రానికి రప్పించడంలో చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గంటా నూకరాజు అన్నారు.

మెడ్‌టెక్‌లో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ భారీ ముందడుగు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్.ఇంక్ అనేది భారతదేశానికి చెందిన స్వదేశీ సర్జికల్ రోబోటిక్ రంగంలో అగ్రగామి సంస్థ, నేడు ఒక చారిత్రక మైలురాయిని ప్రకటించింది. సంస్థ తన నెక్స్ట్-జెనరేషన్ ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ కోసం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)లో 510(కే) ప్రీ-మార్కెట్ నోటిఫికేషన్ దాఖలు చేసింది. ఈ దరఖాస్తు 5 డిసెంబర్ 2025న పూర్తయింది. ఇందులో జనరల్ సర్జరీ, యూరాలజీ, కొలొరెక్టల్, గైనకాలజీ, కార్డియాక్ వంటి అధిక డిమాండ్ ఉన్నసర్జికల్ స్పెషాలిటీలు ఉన్నాయి. ఇది భారతదేశంలో అభివృద్ధి చేసిన సర్జికల్ రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ఒకటి ఇప్పటివరకు చేపట్టిన అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ నియంత్రణ చర్యలలో ఒకటిగా నిలుస్తోంది. దీని ద్వారా ఇప్పటివరకు అంతర్జాతీయ సంస్థల ఆధిపత్యంలో ఉన్నఈ రంగంలో భారత్‌కు ప్రముఖ స్థానం లభిస్తోంది. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, "ఎఫ్‌డీఏకి 510(కే) నోటిఫికేషన్ సమర్పించడం ఎస్ఎస్ ఇన్నోవేషన్స్‌కే కాదు, అధునాతన వైద్య సాంకేతికతల రంగంలో భారత్ గ్లోబల్ నాయకత్వంగా ఎదుగుతున్న దిశలో కూడా ఒక నిర్ణాయక ఘట్టం. ఎస్ఎస్ఐ మంత్రను చవకగా, అందుబాటులో ఉండేలా, సాంకేతికంగా ప్రత్యేకతతో రూపకల్పన చేశామని అన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా భాసిల్లుతున్న పెందుర్తి వెంకటాద్రి పై ధనుర్మాస ఉత్సవాలు గురువారం మూడో రోజు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున 4: 30 గంటలకు స్వామివారిని మేల్కొల్పిన అర్చక స్వాములు హారతి, సేవాకాలం, శాత్తుమొర్రై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్ధ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీనివాసుని సేవలో పాల్గొన్నారు. ప్రతీరోజు ఉదయం 4:30 నుండి సేవా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజా చార్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం తరుపున ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ నీలిమ తెలియచేసారు.



నిస్సాన్ నుంచి 7 సీటర్ బీ ఎంపీవీ గ్రావైట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నిస్సాన్ మోటార్స్ నుంచి సరికొత్త సెవెన్ సీటర్ బీ ఎంపీవీ గ్రావైట్ ను ఆవిష్కరించనున్నట్టు నిస్సాన్ మోటార్ ఇండియా డైరెక్టర్ సౌరభ్ వత్స తెలిపారు. 2026 ఏడాది ప్రారంభంలో నిస్సాన్ గ్రావైట్ ప్రారంభించబడుతుందన్నారు. ఇది భారతదేశం కోసం బ్రాండ్ యొక్క రిఫ్రెష్ చేయబడిన మరియు వ్యూహాత్మకంగా క్యూరేటెడ్ లైనప్‌లో విడుదల చేయబడిన మొదటి ఉత్పత్తి అని చెప్పారు. ఆధునిక భారతీయ కుటుంబాల కోసం ఉద్దేశించిన ఉద్దేశ్యంతో గ్రావైట్ అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ మాడ్యులారిటీని అందిస్తుందన్నారు. నిస్సాన్ యొక్క పునరుజ్జీవిత ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో విస్తరణను వేగవంతం చేస్తూ దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. జూలై 2024లో నిస్సాన్ మోటార్ ఇండియా యొక్క ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తి రెండవ మోడల్‌గా ప్రకటించబడింది గ్రావైట్ అని, సంస్థ యొక్క ఫార్వర్డ్ మొమెంటంను నొక్కి చెబుతుందన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర పద్మనాభం: పద్మనాభం మండలం అయినాడ గ్రామంలో కొద్దిరోజుల కిందట అగ్నికి ఆహుతైన మూడు కుటుంబాలకు దాతలు తమ వంతు సహాయ సహకారాలు చేస్తున్నారు. అయినాడా స్కూల్లో చదువుతున్న ఓ విద్యార్థి ఇల్లు కూడా ఈ మూడింటి ఇళ్లల్లో ఒకటి, విద్యార్థి ఇల్లు కాలిపోవడంతో అదే పాఠశాల విద్యాబోధన నేర్పుతున్న ఉపాధ్యాయులు చలించిపోయి ఆ విద్యార్థికి అందరూ ఉపాధ్యాయులు కలిసి సుమారు పదివేల రూపాయలు ఆ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక గ్రామస్తులు పెద్ద మనసు చాటుకున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరోజినీ,శ్యామల, ఆంజనేయులు పాల్గొనడం జరిగినది.

కనకమహాలక్ష్మి ఆలయంలో సిబ్బంది బరితెగింపు

సామాన్య భక్తులకు తప్పని అవస్థలు
పోలీసుల ఓవరాక్షన్

విశాలాంధ్ర - వన్‌టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం, విశాఖ ప్రజల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వివాదాలకు నిలయంగా మారుతోంది. సిబ్బంది భక్తుల అవలంబిస్తున్న తీరు ఆలయానికి అప్రతిష్ట తెస్తుంది. గతంలో తిరుమలలో జరిగినట్లుగానే, ఇక్కడ కూడా సామాన్య భక్తులను విస్మరించి, వీఐపీలకు పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ సిబ్బంది తీరుపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అతిథుల పేరిట అక్రమ దర్శనాలు

అమ్మవారిని దర్శించుకోవడానికి గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులను పక్కన పెట్టి, సిబ్బంది తమకు కావాల్సిన వారిని 'అతిథులు' అనే ముసుగులో మధ్య మార్గం ద్వారా లోపలికి పంపిస్తున్నారు. గంటల కొద్దీ వేచి ఉన్న భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోగా, సిబ్బంది తమ సన్నిహితులకు అగ్రతాంబూలం ఇస్తూ దర్శనాలు చేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాసులు ఉన్న వారిని కూడా ఖాతరు చేయకుండా సిబ్బంది తమ బంధువులను స్నేహితులను విఐపి మార్గం ద్వారా పంపిస్తున్నారు.

పాత్రికేయుడిపై దురుసు ప్రవర్తన

క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అక్రమాలను కవరేజ్ చేయడానికి వెళ్లిన పాత్రికేయుల పట్ల ఆలయ సిబ్బంది అత్యంత దారుణంగా ప్రవర్తించి అవమానించారు . విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధిని అడ్డుకుని వెనక్కి పంపించేశారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై ఇలాంటి దాడులకు దిగడం సిబ్బంది అహంకారానికి నిదర్శనమని భక్తులు మండిపడుతున్నారు.

నిజమైన భక్తుల పట్ల కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అమ్మవారికి జరగాల్సిన సహస్ర ఘటభిషేకాలు, ఇతర విశేష పూజలు సామాన్య భక్తులకు అందకుండా పోతున్నాయని, కేవలం పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

"మేము గంటల తరబడి లైన్లలో నిలబడితే, సిబ్బంది తమ వాళ్లను వెనుక నుంచి పంపిస్తున్నారు. ఇది అమ్మవారి సాక్షిగా జరుగుతున్న అన్యాయమని ఒక భక్తుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని, ఈ ఘటనపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు , రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని భక్తులు కోరుతున్నారు. బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సామాన్య భక్తులకు సత్వర దర్శనం కలిగేలా పారదర్శకమైన పద్ధతులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల ఓవరాక్షన్

భక్తులు పట్ల పోలీసులు కూడా అతిగా ప్రవర్తిస్తున్నారు. టౌన్ కొత్త రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులు ఇతర కార్యాలయాలు సిబ్బంది తమ కార్యాలయానికి చేరుకునేందుకు ఆప సోపాలు పడాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనంపై కార్యాలయం సమీపానికి తీసుకెళ్లే వారిని దూరంగా నిలిపివేస్తారు. దింపి వెనక్కొస్తామన్నా అనుమతించటం లేదు. సిబ్బంది వాహనాల్లో వచ్చే అవకాశం లేకపోవడంతో తన బంధువులు డ్రాప్ చేసి వెళ్లడానికి వస్తున్నప్పటికీ కిలోమీటర్ దూరంలోనే నిలిపివేసి వాహనాన్ని పంపించేస్తున్నారు. రోడ్లు ఖాళీగా ఉన్నా అనుమతించకపోవడం పట్ల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి. జె. ఆర్. ఎస్) లోని ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పి. జె. ఆర్. ఎస్ పై జీవీఎంసీ అదనపు కమిషనర్ ఫైనాన్స్ ఎస్.ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ. ఎన్. వి. నరేష్ కుమార్ లతోపాటు అన్ని జోన్ల కమిషనర్లు, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ విభాగం, పరిపాలన విభాగం, రెవెన్యూ, ప్రజా ఆరోగ్యం విభాగం, ఆర్టికల్చర్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశ నిర్వహణ పాటు కలెక్టర్ ఆఫీస్ నుండి వచ్చిన పి.జె.ఆర్.ఎస్ ఫ్రీ ఆడిటర్లు సిహెచ్. ప్రసాద్, వి.సూర్య కిరణ్ లతో ఆర్జీలను ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజల కొరకు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి. జె.ఆర్.ఎస్) లోని ప్రజలు పెట్టుకున్న ఫిర్యాదులు/ ఆర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను అధికారులు తమ లాగిన్ లో 24 గంటలకు మించి ఉంచరాదని, మొదటగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదుదారుడు సంతృప్తి చెంది, సమస్య పరిష్కరించిన తర్వాతే అతనికి ఎండార్స్మెంట్ ఇచ్చిన పిదప ఫిర్యాదును క్లోజ్ చేయాలన్నారు. ఫిర్యాదుదారుని సమస్య పూర్తిగా పరిష్కరించకుండానే ఫిర్యాదులను క్లోజ్ చేయడం వలన మరల అదే ఫిర్యాదు రీఓపెన్ అవుతుందని తెలిపారు. ఫిర్యాదులపై సీఎంఓ కార్యాలయం ప్రత్యేక దృష్టి చారించిందని ఫిర్యాదులు పరిష్కరించకుండా క్లోజ్ చేస్తే చార్జ్ మెమో లు ఇవ్వడం జరుగుతుందని అదనపు కమిషనర్ హెచ్చరించారు. అనంతరం అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజీఆర్ఎస్) రెండు రకాల ఫిర్యాదులు ఉంటాయని ఒకటి ఫైనాన్స్ రెండు నాన్ ఫైనాన్స్ సంబంధించినవని, నాన్ ఫైనాన్స్ కు సంబంధించి ఫిర్యాదులను వెను వెంటనే పరిష్కరించాలని, ఫైనాన్స్ సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు కొంత సమయం పడుతున్నందున ఫిర్యాదుదారుడు తో నేరుగా విషయం వారికి అర్థమయ్యేలా వివరించి, ఆ సమస్య ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలము వారికి తెలిపిన పిదప ఆ ఫిర్యాదుదారుడు మరల ఆ ఫిర్యాదును రీ ఓపెన్ చేయకుండా చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ నుండి వచ్చిన పి జే ఆర్ ఎస్ ఫ్రీ ఆడిటర్లు ప్రజా సమస్యల పరిష్కార వేదిక లోని ఫిర్యాదులను ఏ విధంగా క్లోజ్ చేయాలన్న దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారులు, రెవెన్యూ ఆఫీసర్లు, శానిటరీ సూపర్వైజర్లు, డిపిఓలు, ఏపీడీలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్వో వాటర్ ప్లాంట్ల ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: టచ్ స్టోన్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఆర్వో వాటర్ ప్లాంట్ల ప్రారంభోత్సవం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. "ఆహారము %-% ఆరోగ్యము ద్వారా అపారమైన విద్య" అనే నినాదంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టబడింది. డిసెంబర్ 19న మధ్యాహ్నం 2 గంటలకు ఆనందపురం మండలం వేలంకిలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో, అలాగే మధ్యాహ్నం 2:30 గంటలకు ఆనందపురం మండలం బొడ్డపాలెంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో దాతలు మరియు పాఠశాల యాజమాన్యం సమక్షంలో ఆర్వో వాటర్ ప్లాంట్ల ప్రారంభోత్సవం జరుగనుంది. అదేవిధంగా డిసెంబర్ 20న ఉదయం 9:30 గంటల నుంచి ఆనందపురం మండలం వేలంకి జిల్లా పరిషత్ హై స్కూల్, బొడ్డపాలెం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, పద్మనాభం మండలం పాండ్రంగి జిల్లా పరిషత్ హై స్కూల్, ఆనందపురం మండలం గొట్టిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లలో విద్యార్థులు గ్రామస్తుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి గీతం, గాయత్రీ వైద్య కళాశాలలు మరియు ప్రభుత్వ వైద్యులు సహకారం అందించనున్నారు. టచ్ స్టోన్ చారిటీస్ (హరే కృష్ణ మూవ్మెంట్ అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి వచ్చి వారి ఆరోగ్య భద్రత మరింత మెరుగుపడనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కేజీహెచ్‌లో రోగులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర - వన్ టౌన్: కింగ్ చార్జి ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది నర్సస్ అందరూ క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని నిరుపేద రోగులకు అనాథ రోగులకు చలి విపరీతం కావడంతో దుప్పట్లను అందించారు. ఈ కార్యక్రమం కింగ్ జార్జ్ ఆసుపత్రి గౌరవనీయులు సూపరిడెంట్ డాక్టర్ ఐ వాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో డిప్యూటీ సూపర్నెంట్ రాధాకృష్ణ, డాక్టర్ శ్రీహరి, సి.ఎస్.ఆర్.ఓ గ్రేడ్ వన్ నర్సింగ సూపర్డెంట్ పద్మావతి, ఏపీ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భవాని, వరలక్ష్మి కేజీహెచ్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అధినేత జగన్ కలిసిన విశాఖ జిల్లా నేతలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు అన్ని జిల్లాల నుంచి తాడేపల్లి చేరుకున్న సంతకాల పత్రాల వాహనాలను గురువారం గవర్నర్ కి అందజేసేందుకు మాజీ ముఖ్యమంత్రి , వైసీపీ అధినేత వై.యస్ జగన్మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో రీజనల్ కో-ఆర్డినేటర్లు,జిల్లాఅధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో జరిగిన సమావేశంలో వై.యస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు , మాజీ ఎమ్మెల్యే,దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ , మాజీ ఎమ్మెల్యే, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ళ విజయప్రసాద్ ,గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ,తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు , డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు కలిసి విశాఖ జిల్లాలో వైసిపి పరిస్థితిని తెలియజేశారు ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ ఉద్యమం లా నిర్వహించిన విశాఖ జిల్లా నేతలను జగన్ అభినందించారు.